క్లుప్తంగా

చిత్రలేఖనం పోటీల్లో ఉపాధ్యాయుడు ప్రతిభ

టెక్కలి: టెక్కలి మండలం రావివలస జెడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎం.నారాయణమూర్తికి చిత్రలేఖనం పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించారు. హైదరాబాద్‌కు చెందిన కాసుల చిత్రకళ అకాడమి ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన పోటీల్లో భాగంగా రామాయణం అంశంపై వేసిన చిత్రానికి పతకం వచ్చినట్లు ఉపాధ్యాయుడు నారాయణరావు వెల్లడించారు. పాఠశాల సిబ్బంది ఆయన్ని అభినందించారు.

రైల్వే గేటు మరమ్మతులు వాయిదా

టెక్కలి: టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో రైల్వే గేటు మరమ్మతు పనులు వాయిదా వేసినట్లు రైల్వే పీడబ్ల్యూఐ ఇంజినీర్ వై.చంద్రశేఖరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి ఆదివారం గేటు మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా కొన్ని అనివార్య కారణాలతో బుధవారానికి వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. సాయంత్రం ఆరు నుంచి మరుసరి రోజు ఉదయం ఆరో గంటల వరకూ గేటును మూసివేస్తామని.. ప్రజలు గమనించాలని కోరారు.

రోడ్డు పనులు పరిశీలన



రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో తిరుమలరావు

కంచిలి: గోకర్ణపురం పంచాయతీ పరిధిలో ఉపాధిహామీ పథకం నిధులతో చేపడుతున్న సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను ఎపీడీవో వి.తిరుమలరావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల నాణ్యత ప్రమాణాలు, మెటీరియల్, నిర్మాణ కొలతలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

కుత్తుంలో దంత వైద్య శిబిరం



దంత పరీక్షలు చేస్తున్న డాక్టర్ మీనాక్షి

కంచిలి: దంతాల ఆరోగ్యంపై అశ్రద్ధ వహించొద్దని దంత వైద్యురాలు బాగ మీనాక్షి అన్నారు. కుత్తుం గ్రామంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. 120 మందికి దంత వైద్య పరీక్షలు చేసిన వైద్యులు అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు పయనం



స్విమ్మింగ్ క్రీడాకారులతో అలయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: నరసరావుపేటలో ఈ నెల ఐదు నుంచి ఏడో తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ స్విమ్మింగ్ పోటీలకు అండర్-19 విభాగానికి ఎంపికైన నలుగురు విద్యార్థులు ఆదివారం పయనమయ్యారు. పోటీలకు సిద్ధమైన గోవింద్‌బెహర, రాజు బెహర, సాగర్‌బెహర, తరుణ్‌బెహర, నిరాకర్‌బెహరలను ఆదివారం అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అభినందించారు. విద్యార్థులకు ప్రయాణ ఖర్చుల నిమిత్తం స్థానిక వ్యాపారవేత్త బత్తుల వెంటకరమణ ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తీరంలో బందోబస్తు



డి.వి.జె.రమేష్

సోంపేట: కార్తీక వన భోజనాల సమయంలో సముద్ర స్నానాలు ఆచరించేటప్పుడు పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని బారువ మెరైన్ సీఐ డి.వి.జె.రమేష్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సందర్శకుల భద్రతా దృష్ట్యా తీరంలో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. యువత, ఆకతాయిలు మద్యం తాగి సముద్రంలోకి దిగరాదని, తల్లిదండ్రులు కూడా పిల్లల కదలికలను గమనిస్తూ ఉండాలన్నారు. ప్రభుత్వ ,ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను తీరానికి తీసుకువచ్చే సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఎలుగుబంట్ల సంచారం ఉన్నందున చీకటి పడక ముందే తిరుగు ప్రయాణం చేయాలన్నారు. బారువ, పుక్కల్లపాలెం, రట్టి, సెగళ్లపుట్టుగ బీచ్‌లలో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ప్రజలకష్టాలు!

- ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో మంచినీటి ఎద్దడి
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న పురప్రజలు



ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పురపాలకసంఘం పరిధిలోని ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. ఇచ్ఛాపురం పట్టణం 1986లో మున్సిపాలిటీగా ఆవిర్భవించింది. ఆ సమయంలో ఏర్పాటు చేసిన కుళాయిల ద్వారానే ఇప్పటికీ నీటిని సరఫరా చేస్తున్నారు. అప్పటికీ..ఇప్పటికీ పట్టణ జనాభా మూడురెట్లు పెరిగింది. 2011 లెక్కల ప్రకారం జనాభా సుమారుగా 37 వేలు ఉండేది. ప్రస్తుతం 50 వేలకు చేరింది. ప్రజల అవసరాలకు అనుగుణంగా పురపాలక సంఘం అధికారులు నీటిని ప్రజలకు అందించలేకపోతున్నారు. ప్రధానంగా మున్సిపాలిటీలోని మొదటి మూడు వార్డులు పరిధిలో ఉన్న పురుషోత్తపురం, అమీన్‌సాహెబ్‌పేట, బోర్డర్ ప్రాంతాలకు సుమారుగా నాలుగు దశాబ్దాలుగా నీటికష్టాలు పట్టిపీడిస్తున్నాయి. మూడు వార్డుల ప్రజలకు మంచినీటిని అందించడానికి బాహుదా నది నుంచి 2015లో రూ. 50 లక్షలతో పైప్‌లైన్ వేసినప్పటికీ అవి ట్రయల్ రన్‌లోనే పేలిపోయాయి. దీంతో ఈ ప్రాంత ప్రజలకు ట్రాక్టర్ల ద్వారానే నీటిని అధికారులు సరఫరా చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో..

ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యను మున్సిపల్ అధికారులు గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఏఐఐబీ (ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌వెస్ట్ బ్యాంక్) నిధులు రూ. 58.83 కోట్ల మంచినీటి ప్రాజెక్టు నిర్మాణానికి మంజూరు చేసింది. ఈ మేరకు స్థానిక బాహుదానదిలో 30 అడుగుల లోతున మూడు ఇన్‌ఫిల్‌ట్రేషన్ బావుల నిర్మాణం కూడా పూర్తికావచ్చాయి. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పైప్‌లైన్ పనులు నిలిచిపోయాయి. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సమస్యపై దృష్టిసారించలేదు. ఫలితంగా ప్రజలు తీవ్రమైన నీటి సమస్యను ఎదుర్కొంటున్నారు.

ఇబ్బందుల్లేకుండా చర్యలు



ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. మున్సిపాలిటీలో మంచినీటి సరఫరాలో మొదటి మూడు వార్డులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. పురుషోత్తపురం, అమీన్‌సాహెబ్‌పేట, బోర్డర్ ప్రాంతంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ట్రాక్టర్ల ద్వారా నిరంతరం చర్యలు తీసుకుంటున్నాం.

–ఎస్.రమేష్, మున్సిపల్ కమిషనర్

నీటి సమస్యను ఎదుర్కొంటున్నాం



నిత్యం నీటి సమస్యను ఎదుర్కొంటున్నాం. మా ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలలో ప్రధానమైనది మంచినీటి సమస్యే. మూడు వార్డుల ప్రజలకు నిత్యం నీటిని సరఫరా చేయాలి. వేసవిలో తీవ్రమైన నీటి సమస్యను ఎదుర్కొంటున్నాం. ఈ సమస్యకు శాస్వత పరిష్కారం చూపాలి.

– కాళ్ల నీలావతి, అమీన్‌సాహెబ్‌పేట

నీటి కోసం గొడవ పడుతున్నాం



మున్సిపాలిటీ అధికారులు ట్రాక్టర్ల ద్వారా సరఫరా చేస్తున్న నీటిని పట్టుకొనే సమయంలో మహిళల మధ్య గొడవలు వస్తున్నాయి. మాలాంటి వృద్ధులు నీటిని పట్టుకోవాలంటే ఇబ్బందిగా ఉంటుంది. నీరు పట్టుకోవాలంటే భయమేస్తుంది. అయినా తప్పనిసరి పరిస్థితిలో ట్యాంకర్ల వద్ద పడిగాపులు కాస్తున్నాం.

–కె.ఈశ్వరమ్మ, పురుషోత్తపురం

గణిత ప్రతిభ పరీక్షకు స్పందన



టెక్కలి: పరీక్షకు హాజరైన విద్యార్థులు



కాశీబుగ్గ: మందసలో గణిత పరీక్షను పరిశీలిస్తున్న ఎంఈవో సత్యం

టెక్కలి: సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం టెక్కలిలో నిర్వహించిన మండల స్థాయి గణిత ప్రతిభ పరీక్షకు విశేష స్పందన లభించింది. ఎనిమిది నుంచి పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఈ పరీక్షకు 141 మంది హాజరయ్యారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులు జిల్లాస్థాయి గణిత ప్రతిభ పరీక్షకు అర్హత సాధిస్తారని నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాపారావు, ప్రకాశ్, నరేష్, మురళీకృష్ణ, అప్పారావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గణిత ప్రతిభ పరీక్ష జరిగింది. 73 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ప్రశ్న పత్రాలను ధర్మపురం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం ఎస్.విశ్వనాథం విడుదల చేశారు. గణిత ఉపాధ్యాయులు మధు, త్రిలోచనరావు, రాజేష్, రవీంద్ర, మహేష్, అప్పలనాయుడు, వి.బి.ఆర్.కృష్ణన్, సాహు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: మందస మండల కేంద్రంలోని మహారాజా హైస్కూల్‌లో నిర్వహించిన గణిత ప్రతిభ పరీక్షకు 135 మంది విద్యార్థులు హాజరయ్యారు. గణిత వేదిక మండల ప్రతినిధులు గవ్వ భీమారావు, వమరవల్లి మురళి మాట్లాడుతూ.. ఈ పరీక్షలో రాణించిన వారికి ఈ నెల 17న కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గస్థాయి ప్రతిభ పరీక్ష నిర్వహిస్తామన్నారు. పలాస ఎంఈవో-2 చెరుకుపల్లి సత్యం పరీక్షను పర్యవేక్షించారు.

సోంపేట: సోంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రం గణిత ప్రతిభ పరీక్ష జరిగింది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు, ఉపాధ్యాయులు జి.వి.రమణ, వేణుగోపాల్, దివాకర్, జానకమ్మ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రతిభ పరీక్షకు 194 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉపాధ్యాయులు చింత ఉమారావు, గోపాలకృష్ణ, కిరణ్, సురేష్‌కుమార్, శంకర్, ప్రకాష్ ఉన్నారు.



ఇచ్ఛాపురం: ప్రశ్న పత్రాలను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు



వజ్రపుకొత్తూరు రూరల్: పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



మాట్లాడుతున్న సీఐ మంగరాజు

సోంపేట: మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దని సీఐ డి.మంగరాజు అన్నారు. సోంపేట సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమన్నారు. వాహనం నడుపుతూ మైనర్లు పట్టుబడితే తల్లిదండ్రులపై చర్యలు ఉంటాయన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపరాదన్నారు. సోంపేటలో ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్నాయని చెప్పారు. వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్‌ఐ బి.హైమావతి ఉన్నారు.

డీజీపీకి ఫిర్యాదుపై దర్యాప్తు



: విచారణ చేస్తున్న పోలీసులు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి పంచాయతీలోని ప్రకాష్‌నగర్ కాలనీలో నివాసముంటున్న సోడిపిల్లి లక్ష్మి తన అల్లుడుపై రాష్ట్ర డీజీపీకి ఆన్‌లైన్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో దీనిపై విచారణ చేయాలని జిల్లా ఎస్పీ మహేశ్వరరెడ్డికి ఆదేశాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఎస్పీ సూచనల మేరకు కోటబొమ్మాళి పోలీసుస్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ వి.లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఆదివారం సోడిపిల్లి లక్ష్మి ఇంటికి వెళ్లి విచారణ చేపట్టారు. వీఆర్వో రంగస్వామి, మహిళ సంరక్షణ కార్యదర్శి ఎస్.సుశీల ఉన్నారు.

ఘనంగా నగర సంకీర్తన



నగర సంకీర్తనలో సాయి భక్తులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలలో ఆదివారం వంద మందితో నగర సంకీర్తన కార్యక్రమం, శ్రీసత్యసాయి బాబా వారి దివ్య పాదుకలు ఊరేగింపు కార్యక్రమం జరిగింది. పలాస సత్యసాయి మందిరం, సత్యసాయి విద్యావిహార్ ట్రస్ట్ చైర్మన్ అధ్యక్షులు మల్లా రామేశ్వరరావు ఆధ్వర్యంలో సత్యసాయి శతజయంతి ఉత్సవాలు నిర్వహించారు. సాయంత్రం వేదపారాయణము, దివ్య నామసంకీర్తన, భజన కార్యక్రమం జరిగాయి. జోనల్ కోఆర్డినేటర్ బైరాగి మాస్టర్, సమితి కన్వీనర్ డోకి జగదీష్, ప్రిన్సిపాల్ ప్రీతీ చౌదరి పాల్గొన్నారు.

పలువురికి ఆర్థిక సాయం

టెక్కలి రూరల్: కష్టాల్లో ఉన్న పలువురికి నర్సింగపల్లి సేవాసంఘం సభ్యులు అండగా నిలిచారు. నర్సింగిపల్లి గ్రామానికి చెందిన పల్ల ముద్దమ్మ, సింహాద్రి శ్రీనులు ఇటీవల ప్రమాదంలో గాయపడ్డారు. వీరికి సంఘ సభ్యులు రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. అలాగే టెక్కలికి చెందిన నెయ్యిల గోపినాథ్‌కు రూ.5 వేలు అందించామని సేవాసంఘం సభ్యులు ఎన్ని షణ్ముఖరావు, మణి తెలిపారు.

అంబేడ్కర్ ఆలోచన మార్గంలో నడవాలి



నూతన కార్యవర్గ సభ్యులు

సోంపేట: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆలోచన మార్గంలో జై భీమ్ సేన సంఘ సభ్యులు నడవాలని సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు నగిరి మోహనరావు అన్నారు. సోంపేట కార్యాలయంలో సంఘ ప్రతినిధులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కంచిలి, సోంపేట మండల శాఖల కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కంచిలి గౌరవ అధ్యక్షులుగా నూతలపాటి బాబూరావు, ఉపాధ్యక్షులుగా గూండ్ర జగ్గారావు, దూసి మధుసూదనరావును ఎనుకున్నారు. సమావేశంలో చల్లా దేవరాజ్, బుద్ధ ఈశ్వరరావు, డొప్ప వెంకటరావు ఉన్నారు.

అభయాంజనేయస్వామికి తిలక్ పూజలు



స్వామిని దర్శించుకుంటున్న తిలక్ తదితరులు

నందిగాం: సైలాడ గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించిన అభయాంజనేయ స్వామిని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ఆదివారం దర్శించుకున్నారు. అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, చిన్ని జోగారావు, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు పిన్నింటి జయరాం, అంబోడి విష్ణు ఉన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు నలుగురు ఎంపిక



పోటీలకు ఎన్నికైన విద్యార్థులతో తైక్వాండో స్కూల్ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: మధ్యప్రదేశ్ రాష్ట్రం భూపాల్‌లో ఈనెల పదో తేదీ నుంచి జరగనున్న జాతీయస్థాయి తైక్వాండో, 12వ తేదీ నుంచి పంజాబ్ రాష్ట్రం అమృతసర్‌లోని గురునానక్‌దేవ్ యూనివర్సిటీలో నిర్వహించే ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఇచ్ఛాపురంలోని స్కూల్ ఆఫ్ తైక్వాండో నుంచి నలుగురు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని కోచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ మేరకు పోటీలకు ఎంపికన వారిని స్థానిక స్కూల్‌ఆఫ్ తైక్వాండో ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్‌ఫెడరేషన్ పోటీలకు ఎంపికైన ఎ.రేవంత్‌రెడ్డి (78 కేజీల విభాగం), నీలాపు భగవాన్ (51 కేజీల విభాగం), ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైన ఎ.భువనేశ్వరి(53 కేజీల విభాగం), ఉప్పాడ అను (65 కేజీల విభాగం) లను అభినందించారు. కార్యక్రమంలో పిలక విజయ్‌బాస్కర్, ఆర్మీ మాజీ అధికారి దక్కత సుమన్‌రెడ్డి, ఎల్‌సీ రావు, బి.కృష్ణయ్య, చాట్ల తిరుపతి, సీహెచ్ మధు ఉన్నారు.

శ్మశానవాటికకు సీసీ రోడ్డు

ఇచ్ఛాపురం రూరల్: మండపల్లి పంచాయతీ బుడ్డేపుపేట శ్మాశాన వాటికకు 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.4 లక్షలతో సీసీరోడ్డు పనులను ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు పిట్ట మామయ్యరెడ్డి, గ్రామ పెద్దలు తిప్పన కూర్మయ్య, జామి మామయ్య, పురుషోత్తమరెడ్డి ఉన్నారు.

పాఠశాల చెంతనే చెత్త..



టెక్కలిలోని పాలకేంద్రం వద్ద గల ఓ పాఠశాల సమీపంలో చెత్త పేరుకుపోయింది. దీంతో ప్రజలతో పాటు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సమీప వీధుల్లో ఉంటున్నవారు చెత్తను ఇక్కడ పడేస్తుండడంతో సమస్య నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి చెత్తను ఇక్కడ వేయకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

–టెక్కలి రూరల్

టెక్కలిలో కుక్కల వేట



టెక్కలి మేజర్ పంచాయతీలో వీధి కుక్కలను నియంత్రించే చర్యలు అధికారులు చేపట్టారు. ఇందులో భాగంగా పంచాయతీ కార్య నిర్వాహణాధికారి కె.వి.వి.జగన్నాథం ఆధ్వర్యంలో ఆదివారం పలు వీధుల్లో సంచరిస్తున్న కుక్కలను పట్టుకుని వాటిని సుదూర ప్రాంతాలకు తరలించారు. పూర్తిస్థాయిలో కుక్కలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

–టెక్కలి

శిథిల భవనంతో భయం..



సంతబొమ్మాళి మండలం నౌపడ హైస్కూల్ ప్రాంగణంలోని ఓ భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఉపాధ్యాయ సిబ్బంది మేల్కొని ఈ భవనం వైపు ఎవరూ వెళ్లవద్దని హెచ్చరిస్తూ బోర్డును ఏర్పాటు చేశారు. అయితే ఎవరైనా భవనంలోకి వెళ్తే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని.. అధికారులు స్పందించి శిథిల భవనాన్ని కూల్చి వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

–సంతబొమ్మాళి

ఎండకు ఎండుతూ..వానకు తడుస్తూ..



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి గత ప్రభుత్వ హయాంలో విలువైన ఈ-రిక్షాలు మంజూరయ్యాయి. వీటిలో ఒక్కదాన్ని మాత్రమే చెత్త సేకరణకు వినియోగిస్తున్నారు. మిగిలిన ఆరు వాహనాలు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ పాడైపోతున్నాయి. అధికారులు స్పందించి వీటిని వినియోగంలోకి తేవాలని.. లేదంటే కనీసం సరైన భద్రత కల్పించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

–కాశీబుగ్గ

మాజీ మంత్రి సీదిరి పరామర్శ



అక్కుపల్లిలో నారాయణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న అప్పలరాజు తదితరులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆదివారం పర్యటించి మృతుల కుటుంబాలను పరామర్శించారు. పల్లిసారథికి చెందిన అర్జి రామజోగులు, పోతనపల్లి తిరుపతి, బైపల్లి గ్రామానికి చెందిన మరడ యుగంధర్ రెడ్డి, అక్కుపల్లికి చెందిన సురపతి నారాయణ, దోకులపాడుకు చెందిన లండ అంకమ్మతో పాటు మరికొంత మంది మృతుల కుటుంబాలను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మండల ప్రత్యేక ఆహ్వానితులు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరరావు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు లండ రామలింగం, డొంక విద్యాసాగర్, వడ్డి కరుణాకర్, పోతనపల్లి ధర్మారావు, ఐరోతు హేమంత్, బత్తిని హేమంత్, దువ్వాడ ఉమామహేశ్వరరావు, దున్న రమేష్, లక్ష్మణ్, జోగి అప్పారావు, తిర్రి లక్ష్మీనారాయణ ఉన్నారు.

యూవీవీ సభ్యత్వ నమోదు ప్రారంభం



సభ్యత్వ నమోదులో కార్యవర్గ సభ్యులు

కాశీబుగ్గ: ఉద్దాన విద్యా అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో సున్నాదేవి గ్రామంలో వేదిక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఉద్దాన ప్రాంతమైన పలాస, మందస, వజ్రపుకొత్తూరు, సోంపేట మండలాలలో సభ్యత్య నమోదు కార్యక్రమం చేపడుతున్నామని యువీవీ కార్యదర్శి గొరకల లోకేష్ తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు కోరాడ లింగమూర్తి, జినగ సీతారాం, మచ్చ ధనరాజు, కీలు నరసింహులు, రెయ్యి కృష్ణారావు, కీలు నారాయణ, గేదెల డిల్లీశ్వరరావు, రెయ్యి తిరుపతిరావు, పైల విజయ్ ఉన్నారు.

చెరువులు పరిశీలించిన కమిషనర్



కీర్తిరాయి చెరువును పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో మూడు ప్రాంతాలలో ఉన్న కోనేరులను మున్సిపల్ కమిషనర్ రామారావు ఆదివారం పరిశీలించారు. ముత్యాలమ్మ కోనేరు, కీర్తిరాయి చెరువు, ఉదయపురం కోనేరును సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. ఇటీవల మున్సిపల్ సమావేశంలో కార్తీకమాసం స్నానాలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సభ్యులు కోరారు. ఈ నేపథ్యంలో వీటిని పరిశీలించామన్నారు. ఆయనతో పాటు శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

పీడీఎస్‌యూ ఉత్సవాలను విజయవంతం చేయండి

పలాస: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఏర్పడి 50 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఈ నెల ఐదో తేదీన విజయవాడలోని ఎం.బి.వి.కె భవన్‌లో జరుగుతున్న అర్ధశతాబ్ద ఉత్సవాలను విజయవంతం చేయాలని సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ కోరారు. ఈ మేరకు ఉద్దానం ప్రాంతంతో పాటు, పలాస, కాశీబుగ్గలోని వివిధ విద్యా సంస్థల్లో విద్యార్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్యక్రమానికి సర్దార్ భగత్‌సింగ్ మేనల్లుడు, అఖిల భారత విద్యాహక్కుల వేదిక చైర్మన్ జగ్‌మోహన్‌సింగ్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని చెప్పారు.

గౌరమ్మ ఉత్సవాలు

పలాస: ఉద్దానం ప్రాంతం నుంచి అండమాన్ వలస వెళ్లిన ప్రజలు అక్కడ తమ పూర్వీకుల నుంచి వచ్చిన సంస్కృతీ సంప్రదాయాలను పాటిస్తూ సొంత గ్రామాల్లో ఉన్న అనుభూతిని పొందుతున్నారు. తాజాగా వారంతా దసరా తర్వాత ఉద్దానం ప్రాంతంలో జరుపుకునే పండుగల్లో ఒకటైన గౌరమ్మ సంబరాలను శనివారం ఆనందంగా జరుపుకొని మొక్కులు చెల్లించుకున్నారు.